క్లుప్తంగా

వీఎస్‌యూ ఉద్యోగి మృతికి సంతాపం



వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమసింహపురి వర్సిటీ(వీఎస్‌యూ)లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న రవికాంత్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. శనివారం వర్సిటీ ప్రాంగణంలో రవికాంత్ చిత్రపటానికి వీసీ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం ప్రకటించారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వేసవి శిబిరాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. తన మనుమడు కోశలరామ్ పుట్టిన రోజును పురస్కరించుకుని వాకర్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి దద్దోలు రమణయ్యగౌడ్‌తో పాటు మరో దాత విశ్రాంత ఆర్‌అండ్‌బీ డీఈఈ భాగవతుల రాఘవేంద్ర 900 మంది క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమానికి బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అసోసియేషన్ నిర్వాహకులు డీ అనంతరామారావు, జీ వెంకటసురేంద్రబాబు, ఏ సాయిరాం, కే తిరుపతినాయుడు, ఎస్ బలరామయ్యానాయుడు, పాబోలు సత్యం, నరసయ్య, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్విజ్, చిత్రలేఖన పోటీలు



నెల్లూరు(టౌన్): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాగుంటలేఅవుట్‌లోని విశ్వసాయి ఎస్సార్‌కే స్కూల్లో విద్యార్థులకు పర్యావరణ కాలుష్యంపై శనివారం క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రజాసైన్స్ నెల్లూరు భవన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఇంజినీర్ శశికళ, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, విశ్వసాయి స్కూల్ డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రజాసైన్స్ భవన్ సభ్యులు శ్రీనివాసులు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ట్రయంఫ్ నూతన షోరూం ప్రారంభం



నెల్లూరు(టౌన్): నగరంలోని ఆనం వెంకటరెడ్డినగర్‌లో మోటార్ సైకిళ్లకు సంబంధించిన నూతన ట్రయంఫ్ షోరూం కమ్ వర్క్‌షాపును శనివారం ప్రారంభించారు. ట్రయంఫ్ సౌత్ సర్కిల్ హెడ్ గౌతమ్ మోదీ, ఏరియా సేల్స్ మేనేజర్ రాజీవ్ కన్నన్ ముఖ్యఅతిథులుగా హాజరై షోరూంను ప్రారంభించారు. సర్వీస్ రీజినల్ మేనేజర్ నీరజ్ తివారి, ఏరియా సర్వీస్ మేనేజర్ ప్రభు వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతమ్‌మోదీ మాట్లాడుతూ నెల్లూరు ద్విచక్ర వాహన కస్టమర్లకు ఈ ట్రయంఫ్ షోరూం ఒక ఐకాన్‌గా మారుతుందని తెలిపారు. ఔత్సాహిక రైడర్లకు బలమైన బైకింగ్ సంస్కృతి ట్రయంఫ్ షోరూం ద్వారా కలుగుతుందన్నారు. తమ షోరూం బ్రాండ్ ఒక సరసమైన ఎంపికగా మారనుందన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్ పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు

ఉదయగిరి: ఈ నెల 4న కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వి.గిరిబాబు హెచ్చరించారు. ఉదయగిరి పంచాయతీ బస్టాండ్‌లో ఉన్న పోలీస్ పికెట్‌ను ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నాయని తెలిపారు. మండలంలోని జి.చెరువుపల్లి, గంగిరెడ్డిపల్లి, బండగానిపల్లితోపాటు వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యాలయాల వద్ద, ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయగిరి పట్టణంలోని పలు కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా రాజకీయ పార్టీలు, ప్రజలు శాంతియుతంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు



మనుబోలులో ఆంజనేయస్వామికి పల్లకిసేవ



పొదలకూరులోని మారుతీనగర్‌లో..

పొదలకూరు: మండలంలో హనుమజ్జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న పురాతన వీరాంజనేయస్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రుత్విగరణం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, మహామంత్ర హోమం, పూర్ణాహుతి, కుంభసంప్రోక్షణ, నివేదన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వీరాంజనేయస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అలాగే తాటిపర్తి, ప్రభగిరిపట్నం, కనుపర్తి, మొగళ్లూరు, మహ్మదాపురం, కొత్తకంభాలపల్లి, ఆర్‌వైపాళెం, సూరాయపాళెం, శాంతినగర్, తదితర గ్రామాల్లో అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభగిరిపట్నంలో ఉదయం 6 గంటల నుంచి హనుమాన్‌చాలీసా పారాయణం, సాయంత్రం పూలంగిసేవ, పల్లకిసేవ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

కొడవలూరు: మండలంలో హనుమజ్జయంతిని శనివారం వేడుకగా నిర్వహించారు. మండలంలోని అంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నార్తురాజుపాళెంలో జాతీయ రహదారి పక్కనున్న అభయాంజనేయస్వామి, రైటర్‌తోపులోని ప్రసన్నాంజనేయస్వామి విగ్రహాల వద్ద విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మనుబోలు: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం విశేష పూజలు, పల్లకిసేవ నిర్వహించారు. రాత్రి ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని విశేషంగా అలంకరించి ఒంటె వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అలాగే కట్టువపల్లి, యాచవరం, చెర్లోపల్లి గ్రామాల్లోనూ హనుమజ్జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

ఇందుకూరుపేట: మండలంలో హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇందుకూరుపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు ఉదయగిరి వెంకటశేషాచార్యుల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి విశేషాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. రాత్రి ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.



నార్తురాజుపాళెంలోని అభయాంజనేయస్వామి మందిరంలో..

మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. మైపాడులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం విశేష పూజలు, రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఆంజనేయస్వామి విశేషాలంకారంలో దర్శనమిచ్చారు.



పొదలకూరు: ప్రభగిరిపట్నంలో..



కనుపర్తిలో..



మనుబోలు: యాచవరంలో..

గెలిచేదెవరో.. ఓడేదెవరో..

- కోవూరు ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ
- 4న ఎన్నికల కౌంటింగ్
- 24 రౌండ్లలో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



కోవూరు: కోవూరు అసెంబ్లీ ఎన్నికల ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సార్వత్రిక ఎన్నికలు మే 13న ముగిశాయి. కౌంటింగ్‌కు మరో రెండు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ కోవూరు అసెంబ్లీ స్థానం నుంచి గెలిచేదెవరో..ఓడేదెవరో అంటూ సర్వత్రా చర్చలు నడుస్తున్నాయి. కోవూరు నియోజకవర్గంలో మొత్తం 2,67,345 ఓట్లు ఉండగా, ఈ దఫా ఎన్నికల్లో 2,11,975 మంది ఓటు వినియోగించుకున్నారు. 79.29 శాతం పోలింగ్ నమోదైంది. ఇందుకూరుపేటలో అత్యధికంగా 85.60, బుచ్చిరెడ్డిపాళెంలో 76.01 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ పూర్తయినప్పటి నుంచి కౌంటింగ్ కోసం ప్రజలు ఎంతో ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. 2019 ఎన్నికల్లో కోవూరు స్థానం నుంచి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు గడపగడపకు చేరాయి. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన పేద, మధ్యతరగతి ప్రజలు తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని, ఆ పార్టీకే ఓటేసినట్లు సమాచారం. ముఖ్యంగా మహిళలు ఫ్యాన్ గుర్తుకే ఓటేసి తమ కృతజ్ఞత చాటుకున్నట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. ప్రజల ఆశల మేరకు కోవూరు అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోవూరు మరోసారి విజయం సాధించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కోవూరు ఎన్నికల ఫలితం అటు అభ్యర్థుల్లోనూ, ఇటు ప్రజల్లోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది.

ఓట్ల లెక్కింపు ఇలా..

కోవూరు నియోజకవర్గ పరిధిలో బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 324 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ దఫా ఎన్నికల్లో 2,11,975 మంది ఓటు వినియోగించుకున్నారు. కోవూరుకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈ నెల 4న నెల్లూరురూరల్ పరిధిలోని పియదర్శిని కళాశాలలో జరగనుంది. కౌంటింగ్‌కు సంబంధించి 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం 24 రౌండ్లలో ఫలితం తేలనుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ బుచ్చిరెడ్డిపాళెం మండలం మునులపూడి పోలింగ్ బూత్ నుంచి ప్రారంభమై ఇందుకూరుపేట మండలం జంగందొరువు పోలింగ్ బూత్‌తో పూర్తవుతుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించనున్నారు. ఆ తరువాత ఈవీఎంలను లెక్కిస్తారు. మొదటి రౌండ్‌లో ఒకటి నుంచి 14వ బూత్ వరకు ఓట్లను లెక్కించనున్నారు. రెండో రౌండ్‌లో 15 నుంచి 28వ బూత్ వరకు, మూడో రౌండ్‌లో 29 నుంచి 42, నాల్గో రౌండ్‌లో 43 నుంచి 56 వరకు, ఐదో రౌండ్ 57 నుంచి 70 వరకు, ఆరో రౌండ్‌లో 71 నుంచి 84 వరకు పోలింగ్ బూత్‌లను లెక్కించనున్నారు. ఏడో రౌండ్‌లో 85 నుంచి 95, 8వ రౌండ్‌లో 96 నుంచి 109 వరకు, 9వ రౌండ్‌లో 110 నుంచి 123 వరకు, పదో రౌండ్‌లో 124 నుంచి 137 వరకు, 11వ రౌండ్‌లో 138 నుంచి 151 వరకు, 12వ రౌండ్‌లో 152 నుంచి 165 వరకు, 13వ రౌండ్‌లో 166 నుంచి 179 వరకు, 14వ రౌండ్‌లో 180 నుంచి 193 వరకు, 15వ రౌండ్‌లో 194 నుంచి 207 వరకు, 16వ రౌండ్‌లో 208 నుంచి 221 వరకు, 17వ రౌండ్‌లో 222 నుంచి 235 వరకు, 18వ రౌండ్‌లో 236 నుంచి 249 వరకు, 19వ రౌండ్‌లో 250 నుంచి 263 వరకు, 20వ రౌండ్‌లో 264 నుంచి 277 వరకు ఉన్న పోలింగ్ బూత్‌లను లెక్కించనున్నారు. 21వ రౌండ్‌లో 278 నుంచి 291, 22వ రౌండ్‌లో 292 నుంచి 305 వరకు, 23వ రౌండ్ 306 నుంచి 319 వరకు ,24వ రౌండ్‌లో 320 నుంచి 324 వరకు ఉన్న పోలింగ్ బూత్‌లను లెక్కించనున్నారు. చివరి రౌండ్‌లో రెండు ఈవీఎంలను మాత్రమే లెక్కించనున్నారు.

హనుమాన్ శోభాయాత్ర జయప్రదానికి పిలుపు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న హిందూ చైతన్య వేదిక నేతలు

నెల్లూరు(బృందావనం): హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రతో హిందువులందరూ పాల్గొని జయప్రదం చేయాలని హిందూ ఆ వేదిక రాష్ట్ర నేతలు నాగశ్రీనివాస్, కాకు మురళీరెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను మూలాపేటలోని కోనేటిమిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధి, కార్యసిద్ధి, స్వామి భక్తికి, పరాక్రమానికి హనుమంతుడు నిదర్శనమన్నారు. హనుమంతుని గుణగణాలను సమాజం పునికి పుచ్చుకోవాలన్న సదాశయంతో హనుమాన్ శోభాయాత్ర చేపడుతున్నామన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి సాయంత్రం 3గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కేవీఆర్ పెట్రోలుబంక్, ఆర్టీసీ బస్టాండ్, మద్రాస్‌బస్టాండ్, వీఆర్సీ సెంటర్, గాంధీబొమ్మ, శివాజీసెంటర్, ఏసీసెంటర్, కనకమహల్ సెంటర్, బోసుబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట మీదుగా ఆర్ఎస్సార్ఎం ఉన్నత పాఠశాల వరకు శోభాయాత్ర సాగుతుందని వివరించారు. ఆర్ఎస్సార్ఎం ఉన్నత పాఠశాలలో అయోధ్య నుంచి తీసుకొచ్చిన ప్రతిమలతో ఏర్పాటు చేసిన శ్రీరామదర్బార్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తులు ద్విచక్ర వాహనాలపై తరలివచ్చి శోభాయాత్రలో పాల్గొని శ్రీరామదర్బార్‌ను సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ సమావేశంలో చైతన్యవేదిక జిల్లా కన్వీనర్లు పీజీ మహేష్, సాల్లేటి వెంకటేశ్వర్లు, సాయి శ్రీనివాస్, పీఎస్వీ సాయి, ప్రణీత్‌రెడ్డి, పువ్వాడి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది



తల్లిదండ్రులకు వందనం చేస్తున్న చిన్నారులు

కోవూరు: పిల్లలకు అమ్మానాన్నలు జీవితకాలం సంతోషాన్ని ఇచ్చే తరగని వనరులు, వారి రుణాన్ని ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేమని జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్‌కుమార్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం గ్రంథాలయంలో ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే, నాన్న జీవితాన్ని పిల్లలకు ఇస్తారని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు, ఉన్నతమైన వ్యక్తిత్వం, క్రమశిక్షణ తల్లిదండ్రుల నుంచే పిల్లలు నేర్చుకుంటారన్నారు. సమాజ సేవ, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, చక్కటి బాంధవ్యాలు కలిగి ఉండడం నేటి ఆధునిక కాలంలో పిల్లలకు తల్లిదండ్రులు నేర్పాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కే మంజులత, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముత్తుకూరు హైస్కూల్‌లో ఇంటర్ తరగతులు ప్రారంభం

ముత్తుకూరు: స్థానిక ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్‌ను ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు శనివారం నుంచి ఇంటర్ తరగతులను ప్రారంభించినట్టు హెచ్‌ఎం చల్లా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంగ్ల మాధ్యమంలో ఎంపీసీ, సీఈసీ గ్రూపులతో కోఎడ్యుకేషన్‌ను ప్రారంభించామని చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా ఇంటర్ విద్యను అందిస్తోందని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా పదోతరగతి ఫలితాల్లో ముత్తుకూరు హైస్కూల్ విద్యార్థిని లాస్యలహరి 581 మార్కులను సాధించి మండల టాపర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ విద్యార్థిని ఫొటోను వినియోగిస్తూ ఇంటర్ తరగతులపై ప్రచారం నిర్వహిస్తున్నారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు: మనుబోలు-చెర్లోపల్లి మార్గంలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. హోమగుండం వెలిగించి ధునిపూజ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

గరుడ వాహనంపై శ్రీవారి చిద్విలాసం



కల్పవృక్ష వాహనంపై శ్రీవారు



గరుడ వాహనంపై శ్రీవారు

పొదలకూరు : పట్టణంలోని లక్ష్మీగోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీవారి విశేషాలంకారంలో గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. ఉత్సవంలో భక్తులు చెక్క భజనను ప్రదర్శించారు. గోవింద నామస్మరణలతో దేవస్థానం ప్రాంగంణం పులకించింది. శనివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆకులూరు మధుసూదన్, నీరజ, ఆకులూరు హేమంత్‌కుమార్,అనూరాధ దంపతులు ఉభయకర్తలుగా వ్యహరించారు. సాయంత్రం అశ్వ వాహన సేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా కోటేశ్వరరావు, శేషమ్మ, శ్రీనివాసులు, వెంకటసునీత, ప్రసాద్‌నాయుడు, పుష్పలత, చంద్రశేఖర్, ఆనందమ్మ, సింహాచలం, బుజ్జమ్మ వ్యవహరించారు. ఆలయ పాలక కమిటీ సభ్యులు పెండ్యాల రమణయ్య, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం శ్యాంప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, మురళి, తదితరులు పర్యవేక్షించారు.

యోగా సాధనతో ఆరోగ్యకర జీవనం



సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

కొడవలూరు: యోగా సాధనతో ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని కొడవలూరు గ్రంథాలయాధికారిణి రాజేశ్వరి అన్నారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో విద్యార్థులతో శనివారం సూర్య నమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వయస్సు నుంచే యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. అనేక రకాల ఆరోగ్య సమస్యలను యోగా సాధన ద్వారా దూరం చేయవచ్చన్నారు. యోగాలో సూర్య నమస్కారాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, వాటిని ప్రతిరోజూ చేయాలని సూచించారు.

ఎంఈఓ బాధ్యతల స్వీకరణ

సోమశిల: అనంతసాగరం మండల ఎంఈఓగా జానకీరాం శనివారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సంగం మండలంలో విధులు నిర్వహిస్తూ అనంతసాగరానికి ఎఫ్ఏసీ ఎంఈఓగా వచ్చారు. ఇక్కడ ఎంఈఓగా విధులు నిర్వహించిన బాలకృష్ణారెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంఈఓ జానకీరాం మాట్లాడుతూ ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యాబోధన చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి కల్యాణోత్సవం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ పరిధిలోని పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం వార్షికోత్సవం, హనుమజ్జయంతిని పురస్కరించుకుని సాయిమాత నిత్యాన్నప్రసాదాలయం ద్వారకామాయిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం కనుల పండువగా నిర్వహించారు. టీటీడీ వేదపండితులు వేదగిరి ఫణిశర్మ, నారాయణం దాశరథి ఆచార్యుల ఆధ్వర్యంలో దేవదేవేరులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. భక్తులు విశేషంగా హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కల్యాణ మహోత్సవానికి ఉభయకర్తలుగా కృష్ణగిరి దేశ్‌పాల్‌సింగ్, దేవకీదేవి దంపతులు వ్యవహరించారు. శ్రీసాయిదర్బార్ అద్దాల మందిర చైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, సాయిభక్తబృందం పర్యవేక్షించింది.